సాక్షి జగిత్యాల

ఆదివారం । 5 । నవంబర్ । 2023

నామినేషన్ల వివరాలు.. 2వ రోజు

నియోజకవర్గం	నామినేషన్లు	సెట్లు
జగిత్యాల	01	01
కోరుట్ల	01	01
ధర్మపురి	01	01

వ్యవసాయ విద్యార్థుల ఫ్లాష్ మాబ్

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాల కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఫ్లాష్ మాబ్ డ్యాన్స్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మ్యూజిక్ సాంగ్స్‌పై చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి నారాయణ్‌భట్, కల్చరల్ క్లబ్ ఇన్‌చార్జి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

చక్కెర ఫ్యాక్టరీపై మాట్లాడకపోవడం బాధాకరం



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

మెట్‌పల్లి(కోరుట్ల): కోరుట్ల సభలో ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణపై సీఎం కేసీఆర్ ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో పట్టణంలోని మార్కెట్ యార్డులో శనివారం రైతు సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి మాట్లాడుతూ, ఫ్యాక్టరీ పునరుద్ధరణపై సీఎం సానుకూల ప్రకటన చేస్తారని రైతులు భావించారన్నారు. కానీ సభలో దాని ఊసెత్తకపోవడం బాధాకరమని వాపోయారు. ఈ ఎన్నికల్లో కోరుట్ల నుంచి పెద్ద సంఖ్యలో చెరుకు రైతులు నామినేషన్లు వేసి బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెబుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బద్దం శ్రీనివాస్‌రెడ్డి, గురిజెల రాజిరెడ్డి, లింబారెడ్డి, భూమారెడ్డి, కిరణ్, నారాయణ, సాగర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువకు గండి.. పట్టించుకోండి



గండి పడి వృథాగా పోతున్న నీరు

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని గుండంపల్లి శివారులో ఎస్సారెస్పీ డీ–29 కాలువకు గండిపడి నీరు వృథాగా పోతుంది. దీంతో ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి గ్రామాలకు సాగు, తాగేందుకు నీరందని పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ దెబ్బతిన్న చోట మరమ్మతు చేయించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎస్సారెస్పీ అధికారుల పనితీరుపై మండల సర్వసభ్య సమావేశాల్లో పలుసార్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వస్తున్నా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆయకట్టు చివరి గ్రామాల ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. తక్షణమే గండిపడ్డ చోట మరమ్మతు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.

నాణ్యమైన సేవలందించాలి



మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

జగిత్యాలజోన్: వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలని, విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో జగిత్యాల టౌన్ సబ్ డివిజన్, రూరల్ సబ్ డివిజన్‌పరిధిలోని విద్యుత్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ, విద్యుత్ సంస్థపై నమ్మకం ఉంచేలా ఉద్యోగులు ప్రయత్నించాలని కోరారు. విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించేలా వినియోగదారులను ప్రోత్సహించాలన్నారు. కాలిపోయిన, పాడైన మీటర్లను వెంటనే మార్చి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా విద్యుత్ లైన్లు పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్ఈకి వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు తిరుపతయ్య, రాజిరెడ్డి, ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంలో టీకాల పాత్ర ప్రధానం



సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

సారంగాపూర్(జగిత్యాల): చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడటంలో టీకాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని లచ్చక్కపేట గ్రామంలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. చిన్నారులకు ఇచ్చే టీకాలు వ్యాధులు దరిచేరకుండా ఉపయోగపడతాయని, భవిష్యత్‌లోనూ ప్రమాదకరమైన రోగాలు రాకుండా దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి టీకాలు వేయించే బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట సూపర్‌వైజర్ సులోచన, ఎంఎల్‌హెచ్‌పీ ఆశ్లేష, ఏఎన్‌ఎంలు పద్మలత, శ్యామలత, ఆశ కార్యకర్తలు లక్ష్మి, సుశీల తదితరులు ఉన్నారు.

జంప్ జిలానీలు..

- పార్టీలు మారుతున్న నాయకులు
- ఉదయం ఒక పార్టీలో.. సాయంత్రానికి మరో పార్టీలోకి జంప్
- అయినా కండువాలు కప్పుతున్న ప్రధాన పార్టీలు



గొల్లపల్లి(ధర్మపురి): అసెంబ్లీ ఎన్నికల వేళ పార్టీల్లో ఉన్న నేతలు ఎప్పుడో ఏ పార్టీలో చేరుతారో తెలియని పరిస్థితి నెలకొంది. ఉదయం ఓ పార్టీ.. సాయంత్రం మరో పార్టీలో చేరిన సందర్భాలు ఉన్నాయి. కొన్ని గంటల వ్యవధిలోనే కొందరు నాయకులు కండువాలు మార్చుతున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు తమవైపు తిప్పుకొని కండువాలు కప్పే కార్యక్రమాన్ని పనిగా పెట్టుకుంటున్నాయి. నెలలో అధికార పార్టీ నాయకులు ఎంతోమందిని బీఆర్‌ఎస్‌లోకి చేర్చుకున్నారు. జిల్లాలోని కోరుట్ల, ధర్మపురి, జగిత్యాలలో ఎక్కువగా పార్టీలు మారుతున్నారు. ప్రస్తుతం శాసన సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్తున్న ప్రధాన పార్టీల్లోకి పలువురు నేతలు మారడం చర్చనీయాంశమైంది.

నేతల కదలికలపై ఆరా..

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తమపార్టీ నేతలు ఎవరిని కలుస్తున్నారు, ఎటు వెళ్తున్నారన్న దానిపై ఆయాపార్టీల నాయకులు తెలుసుకుంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం, మండల, నియోజకవర్గ నేతలకు అందుబాటులో ఉండకపోవడం వంటి వాటిపై ఆరా తీస్తున్నారు. పార్టీ మారే ఆలోచనలో ఉన్నారా? దేనిపైనైనా అసంతృప్తితో ఉన్నారా? అన్నదానిపై అనచరుల ద్వారా తెలుసుకుంటున్నారు.

కార్యకర్తల నుంచి కీలక నేతల వరకు..

జిల్లాలోని కోరుట్ల, ధర్మపురి, జగిత్యాల నియోజకవర్గాల్లో ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు ఇటీవల జోరుగా కండువాలు మార్చుతుండటంతో జిల్లాలో జంపింగ్ పాలిటిక్స్ జోరందుకున్నాయి. సాధారణ కార్యకర్తలు మొదలుకొని కీలక నేతల దాకా పార్టీలు మారుతున్నారు. పార్టీలో ఉన్నవారిని కాపాడుకోవడం కోసం ఇతర పార్టీలకు గాలం వేయడం, పార్టీ వీడినవారిని మళ్లీ సొంతగూటికి ఆహ్వానించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ వ్యవహారంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. పార్టీలో చేరినవారితో పాటు పాతవారికి కండువాలు కప్పిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేస్తూ నియోజకవర్గ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారు.

బీజేపీలో..

మొదటి రెండు జాబితాల్లో అభ్యర్థుల పేర్లను అధిష్టానం ప్రకటించడంతో బీజేపీ ప్రచారం కాస్త వెనుకబడింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులను ముందే ప్రకటించడంతో రెండు పార్టీలు ప్రచారంలో దూసుకుపోతున్నాయి. బీజేపీ అభ్యర్థులను ఆలస్యంగా ప్రకటించడంతో కార్యకర్తలు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో కమలం పార్టీలో స్తబ్ధత నెలకొంది.

ఆశ చూపుతూ.. మద్దతు కూడగట్టుకుంటూ..

- గత సార్వత్రిక, స్థానిక ఎన్నికల్లో కీలకంగా పనిచేసిన వారితో పాటు ప్రస్తుతం ప్రజాప్రతినిధులుగా ఉన్నవారితో మళ్లీ లబ్ధిపొందవచ్చనే ఉద్దేశంతో పార్టీలు మారేలా రాజకీయాలు కొనసాగుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జంపింగ్‌లు ఎక్కువకావడంతో ప్రధాన పార్టీలకు తలనొప్పిగా మారింది. కొన్నేళ్లుగా పార్టీకి దూరంగా ఉన్నా పట్టించుకోని పార్టీల నాయకులు ఇప్పుడు వారి ఇళ్లకు వెళ్లి కలుస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పదవులు ఇప్పిస్తామని ఆశ చూపుతూ మద్దతు కూడగట్టుకుంటున్నారు.



ఇటీవల రాయికల్‌లో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో తిరిగి కాంగ్రెస్‌లో చేరిన దంపతులు

ఉమ్మడి జిల్లాలో 7 నుంచి కేసీఆర్ పర్యటన



సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్‌ఎస్ ప్రచారాన్ని ముమ్మరంచేసింది. విపక్షాల కంటే ఎన్నికల ప్రక్రియలో ఒక అడుగు ముందుండేలా వ్యూహం అమలుచేస్తోంది. అన్ని పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించిన గులాబీ బాస్ ఎన్నికల ప్రచారమూ ముమ్మరం చేశారు. ఇప్పటికే కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో పలునియోజకవర్గాలను చుట్టేశారు. రెండో విడతలో మిగతా నియోజకవర్గాల్లో ప్రచారం చేయనున్నారు.

బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ సభలు ఇలా..

తేదీ	నియోజకవర్గం
7న	మంథని, పెద్దపల్లి
17న	కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్
20న	మానకొండూరు
24న	రామగుండం
26న	జగిత్యాల, వేములవాడ

మీకు తెలుసా?

0 శాసనసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులకు స్థానమివ్వని నియోజకవర్గం చొప్పదండి. ఇక్కడ 13సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా స్వతంత్ర అభ్యర్థులుగా పలువురు పోటీ చేసినా ఓట్లను రాబట్టుకోలేకపోయారు.

1 ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కరే అత్యున్నత ప్రధానమంత్రి పీఠాన్ని అధిష్టించారు. పాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరకు చెందిన పాములపర్తి వెంకట నర్సింహారావు మంథని ఎమ్మెల్యేగా నాలుగు సార్లు గెలుపొందగా హన్మకొండ, రాంటెక్, ఒడిశా, నంద్యాల నుంచి ఎంపీగా నిలిచి ప్రధానమంత్రి పదవిని నిర్వహించి దేశవ్యాప్త కీర్తి గడించారు.

ఉమ్మడి కరీంనగర్ చరిత్రలో ఒకరే ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ధర్మారావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.

2 ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. మంథని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పీవీ నర్సింహారావు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ముస్తాబాద్ మండలం మోహినికుంటకు చెందిన కేసీఆర్ ముఖ్యమంత్రిగా రెండుసార్లు వ్యవహరించగా మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లా చరిత్రలో మహిళా ఎమ్మెల్యేలుగా గెలిచింది ఇద్దరే. మెట్‌పల్లి నుంచి కొమొరెడ్డి జ్యోతి, చొప్పదండి నుంచి బొడిగె శోభ.

3 ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు పౌరసరఫరాల శాఖ మంత్రులుగా వ్యవహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఈటల రాజేందర్, గంగుల కమలాకర్ సివిల్ సప్లయ్ మినిస్టర్‌గా వ్యవహరించారు.

4 ఉమ్మడి రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఎంపీగా గెలిచిన అరుదైన వ్యక్తిగా పీవీ నర్సింహారావు సత్తాచాటారు. నాలుగుచోట్ల నాలుగు సార్లు ఎంపీగా గెలిచారు. తొలుత హన్మకొండ నుంచి ఎంపీగా గెలుపొందగా తదుపరి జరిగిన ఎన్నికల్లో రాంటెక్, నంద్యాల, ఒడిశా నుంచి గెలుపొందారు.

నలుగురు తండ్రి కొడుకులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. కేసీఆర్, అతని కుమారుడు కేటీఆర్, శ్రీపాదరావు ఇతని కుమారుడు శ్రీధర్‌బాబు, చెన్నమనేని రాజేశ్వర్‌రావు ఇతని కుమారుడు రమేశ్‌బాబు, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, అతని తనయుడు సతీష్‌కుమార్ ఎమ్మెల్యేగా వ్యవహరించారు. – కరీంనగర్ అర్బన్

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు తీసుకెళ్లాలి



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల పోస్టర్‌ను శనివారం 15వ వార్డులో ఆవిష్కరించారు. మరోసారి అవకాశం ఇస్తే జగిత్యాలను మరింత అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ మల్లికార్జున్ నాయకులు తదితరులు ఉన్నారు.

పెన్షనర్ల సంక్షేమమే ధ్యేయం

పెన్షనర్ల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నో సౌకర్యాలు, సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయుల, ఉద్యోగుల పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. మూడోసారి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకువచ్చి ఫిట్‌మెంట్, వేతనాలు సాధిద్దామని పేర్కొన్నారు. గంగరాజం తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి కృషి

రాయికల్(జగిత్యాల): మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, ఆసరా తదితర పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం రాయికల్ మండలం కుమ్మరిపల్లి, మైతాపూర్, ధర్మాజీపేట గ్రామానికి చెందిన సుమారు 200 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం రాయికల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, మున్సిపల్‌చైర్మన్ మోర హన్మండ్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ మారంపల్లి రాణి, పట్టణ అధ్యక్షుడు ఇంతియాజ్, సర్పంచులు చింతలపల్లి స్వప్న, అజారొద్దీన్, హారిక, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు దొంతి నాగరాజు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు అబ్బూరి మల్లేశంగౌడ్‌తో పాటు 50 మంది, మాజీ సర్పంచ్ గరిమెల్ల రాజయ్య తదితరులు శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏళ్ల గంగనర్సు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసీఫ్, ఉపసర్పంచ్ పద్మ, నాయకులు శ్రీనివాస్, మహేశ్, షకీల్, శేఖర్ పాల్గొన్నారు.

ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చడంలో విఫలం



పట్టణంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, నాయకులు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చడంలో సీఎం కేసీఆర్ సర్కార్ పూర్తిగా వైఫల్యం చెందడంతో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని జగిత్యాల కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 46వ వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్ గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. ప్రచారంలో భాగంగా గాజుల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గత ఎన్నికల్లో యావర్‌రోడ్డును వంద ఫీట్లకు విస్తరిస్తామని అధికారంలోకి వచ్చి కేవలం ప్రభుత్వ కార్యాలయాలున్న చోట మాత్రమే విస్తరించిన బీఆర్‌ఎస్ ప్రజలను మోసం చేసిందన్నారు. నాలుగేళ్లుగా రేషన్‌కార్డులు జారీ చేయలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటన్నారు. ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చడంలో విఫలమైన బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపి కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరి నాగభూషణం, కొత్త మోహన్, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, లలిత, వడ్లూరి హరి, దయాకర్, మధు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే నిరుపేదల సంక్షేమం

జగిత్యాలరూరల్/రాయికల్: నిరుపేదల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం చల్‌గల్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రిజ్వాన్ కాంగ్రెస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, మున్నాబాయి పాల్గొన్నారు. అలాగే రాయికల్ మండలం దావన్‌పల్లి, కట్కాపూర్, దావన్‌పల్లి గ్రామాలకు చెందిన సుమారు 100 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఆరు గ్యారెంటీ స్కీంలను ప్రతీ గడపకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్సీ అన్నారు. తన గెలుపునకు సైనికుల్లా కృషి చేయాలన్నారు. మాజీ సర్పంచ్ రాజేందర్, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, బానోవత్ లక్ష్మణ్‌నాయక్, సుధాకర్‌రెడ్డి, గంగాధర్, చింతలపల్లి చిన్నరాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. శనివారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోస్టల్ బ్యాలెట్ అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుందని, 12 శాఖల్లోని ఉద్యోగులు, ప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు కమిషన్ అనుమతించిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు 12–డీ ఫారంలో పూర్తి వివరాలతో ఆయా శాఖల నోడల్ అధికారులకు ఈనెల 6లోపు సమర్పించాలన్నారు. పోలింగ్ బూత్‌నకు వెళ్లలేని వారు, ఉద్యోగరీత్యా బూత్‌కు ఓటు వేసేందుకు వెళ్లలేని వారు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలన్నారు. అనంతరం ట్రైనర్ తిరుపతి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగంపై వివరించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరేశ్, సంక్షేమాధికారి రాజ్‌కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వాహనం తనిఖీ చేయండి

- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్




రాయికల్ ఠాణాను పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

రాయికల్(జగిత్యాల): శాసనసభ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. శనివారం రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామంలోని చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రాయికల్ ఠాణాను సందర్శించి రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అనుమానితుల వివరాలు సేకరించాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. విధుల పట్ల పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ వెంట ఎస్సై అజయ్ ఉన్నారు.


పోలింగ్ శాతం పెంచాలి

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణాల్లో పోలింగ్ శాతం పెంపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్పీలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతుందని, ఈసారి పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెరిగేలా ప్రజలను చైతన్యపరిచే చర్యలు తీసుకోవాలన్నారు. అవగాహన కార్యక్రమంలో కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మెప్మా ఏవో శ్రీనివాస్‌గౌడ్, డీఎం సునీత తదితరులు పాల్గొన్నారు.


జగిత్యాల, కోరుట్ల, ధర్మపురిలో నామినేషన్లు



ధర్మపురిలో నామినేషన్ వేస్తున్న లక్ష్మణ్‌కుమార్



జగిత్యాలలో నామినేషన్ వేస్తున్న మోహన్



కోరుట్లలో.. ఎండీ రషీద్‌ఖాన్

జగిత్యాల: జిల్లాలో శనివారం రెండో రోజూ మూడు నామినేషన్లు దాఖలైనాయి. తొలిరోజు మూడు నామినేషన్లు దాఖలైన విషయం తెలిసిందే. జగిత్యాల, ధర్మపురి, కోరుట్లలో ఒక్కొక్కటి నమోదయ్యాయి. జగిత్యాలలో స్వతంత్ర్య అభ్యర్థిగా కోటగిరి మోహన్ నామినేషన్ వేయగా, కోరుట్లలో సమాజ్‌వాద్ పార్టీ తరుపున రషీద్‌ఖాన్ నామినేషన్ దాఖలు చేశారు. ధర్మపురిలో కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నామినేషన్ వేశారు.

మరో మూడు రోజుల్లో..

మరో మూడు రోజుల్లో నామినేషన్లు అధికంగా నమోదయ్యే అవకాశం ఉంది. ఈనెల 3 నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తుండగా పోటీచేసే అభ్యర్థులు మంచిరోజులు చూసుకుని నామినేషన్లు వేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. 4,8,9వ తేదీల్లో నామినేషన్లు దాఖలు చేసే అవకాశాలున్నాయి. పండితులు సైతం ఇవే తేదీలను చూపిస్తున్నారు.

సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల: విద్యార్థుల అభ్యున్నతికి సైన్స్ ఆవిష్కరణలు దోహదపడుతాయని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం 31వ జాతీయ బాలల కాంగ్రెస్ జిల్లా స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శన కార్యక్రమం ఓల్డ్ హైస్కూల్‌లో నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ, మానవుని జీవనం సాఫీగా జరిగేందుకు సైన్స్ బాగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా మానస స్కూల్‌కు చెందిన రిషిత, అక్షయ, జ్యోతి స్కూల్‌కు చెందిన ఆర్యన్, సాధ్వి, ప్రజ్ఞ స్కూల్‌కు చెందిన అనన్య, మానస, గౌతమ స్కూల్‌కు చెందిన సుఫ్యానుద్దీన్, శ్రీరామ్, మౌంట్ కార్మెల్‌కు చెందిన ఆదిత్య, అక్విబ్, కోరుట్ల నవ జ్యోతి స్కూల్‌కు చెందిన ప్రవంతి, దీక్షిత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ఆనందరావు, పెద్దిరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంటల్ పరీక్షలు వాయిదా

జగిత్యాల: పదోన్నతుల కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షలను టీఎస్‌పీఎస్సీ వాయిదా వేసినట్లు తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ తెలిపారు. పరీక్షలు ఈనెల 17 నుంచి 25 వరకు జరగాల్సి ఉండగా, ఎన్నికల నేపథ్యంలో వాయిదాపడ్డాయి. తిరిగి డిసెంబర్ 15 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించిందని అశోక్‌కుమార్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

జిల్లా స్థాయి ఎంపిక పోటీలు



పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీస్టేడియంలో శనివారం జిల్లా స్థాయి పాఠశాలల అండర్– 14, 17 బాలబాలికల టెన్నికాయిట్, బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించినట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీరాంనాయక్ తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులను ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పెటా జిల్లా అధ్యక్షుడు పడాల విశ్వప్రసాద్, పీఈటీలు పడాల కృష్ణప్రసాద్, కోటేశ్వర్‌రావు, అజయ్‌బాబు, వెంకటలక్ష్మి, మల్లేశ్వరి, విజయ, దయాకర్, రాజేందర్ పాల్గొన్నారు.

నియోజకవర్గాలకు కాంగ్రెస్ ఇన్‌చార్జిల నియామకం

పెద్దపల్లిరూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ పరిశీలకులను నియమించిందని ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గానికి సలీం అహమద్, చొప్పదండికి రూపకల, మానకొండూరుకు బసనగౌడ దద్దల్, హుస్నాబాద్‌కు సునీల్‌గౌడ పాటిల్, ధర్మపురికి బసనగౌడ తుర్విహాల్‌ను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

మొగిలిపేట పెద్దచెరువులో మొసలి

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని మొగిలిపేట పెద్దచెరువులో శనివారం మొసలి కనిపించింది. పంటపొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులకు మొసలి కనిపించడంతో గ్రామస్తులకు తెలిపారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి



గేదెల కళేబరాలు

రాయికల్(జగిత్యాల): రాయికల్ పట్టణం భీమన్నవాడలో శనివారం మధ్యాహ్నం తెగిపడిన త్రీఫేస్ విద్యుత్ వైర్లకు తాకి నాలుగు గేదెలు మృత్యువాత పడ్డాయి. స్థానికుల వివరాలు.. పట్టణంలోని వొజ్జల భూమేశ్, తోట భూమారెడ్డి, సుతారి గంగారెడ్డి, నీలి పెద్ద నర్సయ్యకు చెందిన గేదెలు మేత కోసం మందలో కలిసి వెళ్తుండగా తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి గేదెలు మృతిచెందినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం గమనించిన కాపరి మిగతా గేదెలను మరో చోటకు తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ట్రాన్స్‌కో అధికారులు నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరారు.

రాజన్న క్షేత్రం.. ప్రజాచైతన్యం



- 2009లో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడిన వేములవాడ
- పునర్విభజనలో మారిన భౌగోళిక చిత్రం
- నాటి సిరిసిల్లలో వరుసగా గెలిచిన వారు లేరు
- విడిపోయాక వేములవాడలో నాలుగుసార్లు ఒక్కరినే వరించిన విజయం

వేములవాడ: రాజన్న క్షేత్రంగా వెలుగొందుతున్న వేములవాడ పేరు ఇప్పుడు చట్టసభలో మారుమోగుతోంది. సిరిసిల్ల నుంచి విడివడి కొత్త మండలాలతో జత కట్టిన వేములవాడ పునర్విభజనలో భాగంగా 2009లో నూతన నియోజకవర్గంగా పురుడు పోసుకుంది. పాత తాలూకాగా పెద్ద విస్తీర్ణం కలిగి, మరో నాలుగు మండలాలను కలుపుకుని శాసనసభ నియోజకవర్గంగా పరిణామం చెందింది. దక్షిణ కాశీగా పేరుగాంచడమే కాకుండా రాష్ట్రంలోనే పేరు ప్రఖ్యాతులు గడించిన వేములవాడకు నియోజకవర్గం గుర్తింపు రావడంతో రాజన్న క్షేత్రానికి మహర్దశ పట్టింది.



ఐదేళ్లకో చారిత్రక మైలురాయి

1952లో సిరిసిల్ల నియోజకవర్గంగా రూపొందిన తర్వాత అప్పటి నుంచి మొన్నటి వరకు వేములవాడ ఆ నియోజకవర్గంలో ఉంటూనే ప్రత్యేక స్థానం కోసం పాకులాడింది. పార్టీ ఏదైనా ఈ నియోజకవర్గం నుంచి హేమాహేమీలు పోటీ చేసి గెలుపొందడమే కాకుండా ఓటమిని సైతం చవిచూసిన వారున్నారు. రాజకీయంగా చైతన్యంతో ఈప్రాంత ప్రజలు ముందున్నారనడంతో అతిశయోక్తి లేదు. సిరిసిల్ల నియోజకవర్గంగా ఏర్పడిన తర్వాత అప్పటి నుంచి 2004 వరకు అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా గెలిచిన అభ్యర్థి లేరు. 1952లో పీడీఎఫ్ అభ్యర్థి జె.ఆనందరావు, 1957లో అమృతలాల్ శుక్లా (పీడీఎఫ్), 1962లో జె. నర్సింగారావు (కాంగ్రెస్), 1967లో సీహెచ్.రాజేశ్వర్‌రావు (సీపీఐ), 1972లో జె.నర్సింగారావు (కాంగ్రెస్), 1978లో సీహెచ్.రాజేశ్వర్‌రావు (సీపీఐ), 1983లో వి.మోహన్‌రెడ్డి (టీడీపీ), 1985లో సీహెచ్.రాజేశ్వర్‌రావు (సీపీఐ), 1989లో ఎన్వీ.కృష్ణయ్య (జనశక్తి), 1994లో సీహెచ్.రాజేశ్వర్‌రావు (సీపీఐ), 1999లో ఆర్.పాపారావు (కాంగ్రెస్), 2004లో సీహెచ్ రాజేశ్వర్‌రావు (టీడీపీ) గెలుపొందారు.

నియోజకవర్గం ఇలా..

2009లో వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంగా అవతరించింది. కొత్తగా వేములవాడ, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట, జగిత్యాల జిల్లా కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాలతో అసెంబ్లీ నియోజకవర్గంగా కొనసాగుతుంది.

ఆవిర్భావం నుంచి ఒక్కరే..

వేములవాడ నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు జరిగిన శాసనసభ ఎన్నికల్లో రమేశ్‌బాబు ఒక్కరే గెలుస్తూ వచ్చారు. 2009లో రమేశ్‌బాబు టీడీపీ నుంచి పోటీ చేసి ఆది శ్రీనివాస్‌పై 1,800 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి రమేశ్‌బాబు పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌పై 25 వేల మెజార్టీతో గెలిచారు. 2014లో టీఆర్ఎస్ నుంచి రమేశ్‌బాబు పోటీ చేసి బీజేపీ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌పై 5 వేల ఓట్లతో, 2018లో మళ్లీ టీఆర్ఎస్ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌పై 15 వేల ఓట్ల మెజార్టీ వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, కాంగ్రెస్ నుంచి ఆది శ్రీనివాస్, బీఎస్పీ నుంచి గోలి మోహన్ పోటీ పడుతుండగా, బీజేపీ ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు.



రేగులపాటి పాపారావు, సీహెచ్ రాజేశ్వర్‌రావు, ఎన్.వీ. కృష్ణయ్య, వి. మోహన్‌రెడ్డి, సీహెచ్ రమేశ్‌బాబు

వేములవాడ నియోజకవర్గ సమాచారం	
మొత్తం ఓటర్లు	2,19,190
పురుషులు	1,05,426
మహిళలు	1,13,734
ఇతరులు	30

వేములవాడ చరిత్ర

- నియోజకవర్గ కేంద్రమైన వేములవాడ దక్షిణకాశీగా ప్రసిద్ధి. రోజూ కనీసం 10 వేల మందికి తగ్గకుండా ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటారు. ఈ సెగ్మెంట్ పరిధిలో అత్యధిక ప్రజల జీవనాధారం వ్యవసాయం. సాగుకు అవసరమైన వనరులు ఉన్నా ఉపాధి కోసం యువత గల్ఫ్ వెళ్తుంటారు.

ప్రస్తుత పరిస్థితి

2009లో నియోజకవర్గంగాఆవిర్భవించిన వేములవాడలో ఆది శ్రీనివాస్ నాలుగుసార్లు ఓడిపోయి తన భవిష్యత్‌ను మరోసారి పరీక్షించుకోనున్నారు. ఇక బీఆర్ఎస్ నుంచి చల్మెడ లక్ష్మీనర్సింహారావు బరిలో ఉండగా, గతంలో కరీంనగర్ అ సెంబ్లీ నుంచి పోటీ చేసి ఓటమిని చవిచూశారు. ఈసారి తన రాజకీయ భవిష్యత్‌ను చక్కదిద్దుకునేందుకు వేములవాడ నుంచి బరిలో నిలిచారు. ఇద్దరికీ చావోరేవో అన్న చందం గానే ఈ ఎన్నికలు ఉన్నాయన్న వాదన వినిపిస్తోంది. అయితే ఆది శ్రీనివాస్‌కు సానుభూతి పని చేస్తుందా..?, లక్ష్మీనర్సింహారావును ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆదరిస్తాయా వేచి చూడాల్సిందే. బీజేపీ నుంచి డాక్టర్ వికాస్‌రావు, తుల ఉమ టికెట్ రేసులో ఉన్నారు.

అసెంబ్లీ బరిలో గల్ఫ్ సంఘాల నేతలు

- ముగ్గురికి సింహం గుర్తు.. ఒకరు ఇండిపెండెంట్



చెన్నమనేని శ్రీనివాస్‌రావు (కోరుట్ల)



గుగ్గిల్ల రవిగౌడ్ (వేములవాడ)



స్వదేశ్ పరికిపండ్ల (నిర్మల్)



కృష్ణ దొనికెని (సిరిసిల్ల)

జగిత్యాలరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురు గల్ఫ్ సంఘాల నాయకులు పోటీ చేస్తున్నారు. గల్ఫ్‌లో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎక్కువ మంది ఉండటంతో సంఘాల నేతలు పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ స్థాపించిన ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థులుగా గుగ్గిల్ల రవిగౌడ్ (వేములవాడ), చెన్నమనేని శ్రీనివాస్‌రావు (కోరుట్ల), స్వదేశ్ పరికిపండ్ల (నిర్మల్) ఇప్పటికే బీ ఫారాలు పొంది సింహం గుర్తుతో బరిలో ఉన్నారు. అలాగే సిరిసిల్ల నుంచి కృష్ణ దొనికెని అభ్యర్థిత్వాన్ని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పరిశీలిస్తోంది. కాగా కొన్ని సమీకరణాల వల్ల పార్టీ అధిష్టానం టికెట్‌ను పెండింగ్‌లో ఉంచినట్లు సమాచారం. అయితే టికెట్ వచ్చినా రాకున్నా సిరిసిల్ల నుంచి కృష్ణ దొనికెని ఇండిపెండెంట్‌గా పోటీలో ఉండే అవకాశం ఉంది.

బీఆర్ఎస్‌తోనే నిరుపేదల సంక్షేమం

- ఎమ్మెల్సీ రమణ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రమణ

రాయికల్(జగిత్యాల): బీఆర్ఎస్‌తోనే నిరుపేదల సంక్షేమం సాధ్యమని, సంజయ్ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని ఎమ్మెల్సీ రమణ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని మైతాపూర్, ఇటిక్యాల గ్రామాల్లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రచారంలో పాల్గొన్నారు. వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ, సీఎం ప్రవేశపెట్టిన పథకాలతో ప్రతి ఇంట్లో లబ్ధిదారులున్నారని, జరగబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ సంధ్యారాణి, మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, సర్పంచ్ సామల్ల లావణ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ మా రంపల్లి రాణి, ఉపసర్పంచ్ చంద్రశేఖర్, శ్రీని వాస్‌గౌడ్, స్వామిరెడ్డి, నారాయణగౌడ్, సాయిగౌడ్, శ్రీనివాస్, కొల్లూరి వేణు, డాక్టర్ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో ధర్మపురిలో చేసిన అభివృద్ధి ఏమి..?

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ధర్మపురి: తొమ్మిదేళ్లు కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యే, చీఫ్ విప్, మంత్రిగా ఉండి ధర్మపురిలో చేసిన అభివృద్ధి ఏంటో చూపించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం పట్టణంలో డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వందలాదిగా జనం తరలిరాగా స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి నంది కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, ధర్మపురిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమని, తలాపున గోదావరి ఉన్న శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించలేకపోయారని పేర్కొన్నారు. గతంలో ధర్మపురి పుణ్యక్షేత్రానికి వచ్చిన సీఎం కేసీఆర్ రూ.500 కోట్లు ఇస్తానని ప్రకటించి ఏమిచ్చారని ప్రశ్నించారు. రైతుల పేరు చెప్పుకొని కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యతా లోపంతో నిర్మించారని విమర్శించారు. మంత్రిగా ఉండి ధర్మపురిలో బస్‌డిపో, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయక పోవడం బాధాకరమన్నారు. అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న బీఆర్ఎస్ నాయకులకు రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్తారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గ్యారంటీ పథకాలను ప్రజలకు అందిస్తామని, అందుకు కాంగ్రెస్ గుర్తుకు ఓటేసి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ర్యాలీలో నాయకులు ఎస్.దినేశ్, వేముల రాజేశ్, ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, నిశాంత్, కటారి చంద్రశేఖర్, బషీర్ తదితరులున్నారు.

పథకాలతో ప్రజలకు లబ్ధి

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత



మోతెలో ప్రచారం చేస్తున్న చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శనివారం జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడ్డ తర్వాత సీఎం కేసీఆర్ నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వృద్ధులకు పెన్షన్లు, రైతులకు రైతుబంధు, రైతుబీమా తదితర పథకాలతో ఎంతో మంది నిరుపేదలకు సహాయం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, జెడ్పీటీసీ మహేశ్, సర్పంచ్ సురకంటి స్వప్న, రైతుబంధు మండల కన్వీనర్ జుంబర్తి శంకర్ పాల్గొన్నారు.

సంజయ్ గెలుపునకు కృషి చేయాలి

రాయికల్(రామగుండం): జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ గెలుపు కోసం మున్నూరుకాపులు కృషి చేయాలని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శనివారం రాయికల్ పట్టణంలో నిర్వహించిన మున్నూరుకాపుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. మున్నూరుకాపుల అభ్యున్నతికి ఎమ్మెల్యే, తాను ఎంతో కృషి చేశామని, జరగబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం మున్నూరుకాపులు సంజయ్‌కి మద్దతిస్తున్నట్లు ఏకగ్రీవ తీర్మానం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, సర్పంచులు పాదం రాజు, నీలి మల్లయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలిచినా బీఆర్ఎస్‌లోకే..

- కోరుట్ల బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ అర్వింద్



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

కోరుట్ల: కోరుట్ల ఎమ్మెల్యేగా ఒకవేళ కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు గెలిచినా బీఆర్ఎస్‌లోకే వెళ్తాడని కోరుట్ల బీజేపీ అభ్యర్థి, ఎంపీ ధర్మపురి అరింద్ అన్నారు. పట్టణంలో శనివారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 35 నుంచి 38 సీట్లు వచ్చే అవకాశం ఉందని, అందులోనుంచి 15 నుంచి 20 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్తారని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామన్నారు. కేంద్రం పసుపు బోర్డు ప్రకటించడంతో 40 ఏళ్ల పసుపు రైతుల కలను ప్రధాని మోదీ నెరవేర్చారని, ఇది తన వ్యక్తిగత విజయమన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబు మనిషని, రాష్ట్రంలో టీడీపీ పోటీ చేయటం లేదంటే పరోక్షంగా కాంగ్రెస్‌కే మద్దతు ఇస్తుందన్నారు. సీఎం కేసీఆర్ కోరుట్లకు వచ్చి ఇక్కడి సమస్యలపై మాట్లాడలేదని, ఆయారాం– గయారాం లాగా సీఎం పర్యటన ఉందని విమర్శించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం 4 కోట్ల ఇండ్లు నిర్మించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 15 లక్షల ఇండ్లు నిర్మించే అవకాశం ఉన్నా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించలేదన్నారు. బీజేపీలో కుల, మత రాజకీయాలను తావులేదని, ముస్లింలకు కూడా దేశంలో లక్షలాది ఇండ్లు ఇచ్చామని వివరించారు. ఆయుష్మాన్ భారత్, ఉచిత రేషన్ తదితర పథకాలు ఇస్తున్నామని, వాళ్లను కూడా ఓట్లు అడుగుతామన్నారు. వారు కూడా బీజేపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అరవింద్ సమక్షంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం వేణుగోపాల్, పట్టణ అధ్యక్షుడు శేఖర్, కౌన్సిలర్లు మాడవేని నరేశ్, జయలక్ష్మి, అలేఖ్య, పెండెం గణేశ్, నాయకులు పాల్గొన్నారు.

'సూరమ్మ' పేరిట మోసం చేసిన ప్రభుత్వం



బొమ్మెనలో ప్రచారం చేస్తున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): సూరమ్మ ప్రాజెక్టుతో మూడు మండలాలకు నీరందిస్తామని ఐదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. శనివారం మండలంలోని బొమ్మెన, తక్కళ్లపెల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని కథలాపూర్, మేడిపెల్లి, బీమారం మండలాలకు సూరమ్మ ప్రాజెక్టుతో నీరందిస్తామని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు భూమిపూజ చేసి ఐదేళ్లు అయినా తట్టెడు మట్టి తీయలేదన్నారు. రైతులు, పేదలను దగా చేసిన బీఆర్ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇల్లులేని పేదలకు నిధులు మంజూరు చేస్తామని, ఆసరా పింఛన్ రూ.4 వేలు ఇస్తామన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజల్లో మంచి స్పందన ఉందని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అజీమ్, నాయకులు అల్లూరి దేవారెడ్డి, జీవన్‌రెడ్డి, లింగంగౌడ్, భాస్కర్, జవ్వాజి చౌదరి, ఆకుల సంతోష్ పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్నివర్గాలకు న్యాయం



ఎన్నికల ప్రచారంలో భోగ శ్రావణి

జగిత్యాలటౌన్: బీజేపీతోనే బడుగు, బలహీనవర్గాలకు న్యాయం సాధ్యమని, ఆడబిడ్డగా మీ ముందుకు వచ్చానని, అండగా నిలిచి అసెంబ్లీకి పంపించాలని బీజేపీ జగిత్యాల అభ్యర్థి డా.భోగ శ్రావణి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని 10,25వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగిత్యాల నియోజకవర్గం ఏర్పడ్డ తర్వాత మొట్టమొదటి సారిగా మహిళకు అవకాశం వచ్చిందని, కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఆమె వెంట నాయకులు వీరబత్తిని అనిల్‌కుమార్, మ్యాదరి అశోక్, ఆముద రాజు, లింగంపేట రాజన్న, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సంఘటన స్థలంలో శివరాజం మృతదేహం

కోరుట్లరూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధి యెఖీన్‌పూర్ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కమ్మరి శివరాజం (35) మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా చందూరు మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన కమ్మరి శివరాజం–మాధురి దంపతులు వృత్తిరీత్యా కొంతకాలంగా కోరుట్ల మండలం నాగులపేటలో నివాసం ఉంటున్నారు. శివరాజం కార్పెంటర్‌గా కోరుట్లలో పని చేస్తూ రోజూ తన బైక్‌పై వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో అతివేగం, అజాగ్రత్తగా బైక్ నడపడంతో యెఖీన్‌పూర్ శివారు పెట్రోల్‌బంకు సమీపంలో మూలమలుపు వద్ద అదుపుతప్పి చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

రాయికల్(జగిత్యాల): మండలంలోని భూపతిపూర్ గ్రామంలో ఆనందపల్లి మల్లికార్జున్ (40) మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అజయ్ వివరాలు.. నెల్లూరు జిల్లా విజ్ఞమూరు మండలం సాకలికొండ గ్రామానికి చెందిన మల్లికార్జున్ మండలంలోని తాట్లవాయి గ్రామంలో మేస్త్రీ పనిచేసేవాడు. అతిగా మద్యం తాగి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో లారీ దగ్ధం



మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది

గొల్లపల్లి(ధర్మపురి): గొల్లపల్లి గ్రామ శివారులో జగిత్యాల–ధర్మారం ప్రధాన రహదారిపై షార్ట్ సర్క్యూట్‌తో ఓ లారీ సగ భాగం దగ్ధమైంది. స్థానికుల వివరాలు.. పెద్దపల్లి జిల్లా మంథని నుంచి జగిత్యాల–ధర్మారం ప్రధాన రహదారి మీదుగా నిర్మల్ వెళ్తున్న లారీ గొల్లపల్లి శివారుకు చేరుకోగానే షార్ట్‌సర్క్యూట్‌తో ఇంజన్ భాగంలో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్, క్లీనర్ కిందకు దిగి నీరు, మట్టితో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. జగిత్యాల అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. తృటిలో డ్రైవర్‌కు ప్రాణాపాయం తప్పింది.